సాక్షి ప్రకాశం

గురువారం । 19 । డిసెంబర్ । 2024



ఒంగోలు డిపోలో హైటెన్షన్

ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం అనుమానాస్పదంగా బ్యాగ్ ఉన్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేశారు. ఇది మాక్‌డ్రిల్‌లో భాగమని తెలిపారు. - 8లో..



కారు ఢీకొని ఒకరు మృతి

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. త్రిపురాంతకం మండలం మేడపి సమీపంలో ఈ ఘటన జరిగింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
29/21

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

19 నుంచి డీఆర్పీలకు మూడు రోజుల శిక్షణ

ఒంగోలు సిటీ: రాష్ట్ర సమగ్రశిక్ష పాఠశాల విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసీ లో భాగంగా డిస్ట్రిక్ట్ రిసోర్సుపర్సన్ లకు ఈ నెల 19, 20, 21 వ తేదీల్లో మూడు రోజుల పాటు రిఫ్రెషర్ ట్రెనింగ్ ఒంగోలు, మార్కాపురంలో నిర్వహిస్తున్నట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ శిక్షణకు కేటాయించిన డీఆర్పీ లు, కేఆర్పీల వివరాలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి ట్రెనింగ్ ప్రారంభమవుతుందన్నారు. నాన్ రెసిడేన్షియల్ విధానంలో మూడు రోజుల ట్రెనింగ్ జరుగుతుందని తెలిపారు. ట్రెనింగ్‌కు కేటాయించిన వారిని సంబంధిత ఎంఈఓ లు విధుల నుంచి రిలీవ్ చేయాలని ఆదేశించారు.

తెరుచుకున్న గాజులపాలెం పాఠశాల



తరగతి గదిలో విద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్..

పుల్లలచెరువు: మండలంలోని గాజులపాలెం ప్రభుత్వ పాఠశాలకు డిప్యుటేషన్‌పై నియమించిన ఉపాధ్యాయుడు మంగళవారం విధులకు హాజరుకాకపోవడంతో విద్యార్థులు బయటే ఉండిపోయారు. దీనిపై 'అయ్యవారు రాక ఆరు బయట విద్యార్థులు' అన్న శీర్షికతో 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయుడికి ఎంఈవో షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఉపాధ్యాయులు విధులకు రావడంతో పాఠశాల తెరుచుకుందని, పూర్తి సమాచారం ఉన్నతాధికారులకు తెలుపుతామని ఎంఈవో తెలిపారు.

జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖాధికారిగా పార్థసారధి



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్థసారథి

ఒంగోలు సిటీ: జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖాధికారిగా జె.పార్థసారధి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

నేడు నెట్‌బాల్ సబ్ జూనియర్ క్రీడాజట్ల ఎంపిక

ఒంగోలు: నెట్‌బాల్ సబ్ జూనియర్ జిల్లా స్థాయి బాలబాలికల జట్ల ఎంపిక ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక దొనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతుందన్నారు. ఎంపికకు హాజరుకాదలచుకున్న క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 21, 22 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

నేడు ఫెన్సింగ్ సీనియర్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఫెన్సింగ్ జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక ఈనెల 19న స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.నవీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, పుట్టిన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. 18 సంవత్సరాల్లోపు వారు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీచేసిన గుర్తింపు కార్డుతో హాజరుకావాలని, 18 సంవత్సరాలు నిండిన వారు ఫెన్సింగ్ అసోసియేషన్ వారు జారీచేసిన గుర్తింపు కార్డుతోపాటు గతంలో ఫెన్సింగ్ క్రీడల్లో పాల్గొన్న క్రీడా సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఆసక్తిగలవారు పూర్తి వివరాలకు సెల్: 7671991147, 8978905694 నంబర్లను సంప్రదించాలన్నారు. జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని జిల్లా కార్యదర్శి జి.నవీన్ తెలిపారు.

పచ్చముఠా గలాటా



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు టీడీపీ నాయకులు ఇసుక, మద్యం, మైనింగ్, మట్టి, రేషన్ మాఫియాలుగా మారి అందిన కాడికి దండుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యేల దగ్గర నుంచి మండల స్థాయి నాయకుల వరకూ ఎవరికి వారు కమీషన్లలో వాటాలేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. అక్రమార్జనలో భాగపంపకాలు, పదవుల పందేరాలు తెలుగు తమ్ముళ్ల మధ్య చిచ్చు రేపుతున్నాయి. ఎక్కడికక్కడ గ్రూపులుగా మారి ఆధిపత్య పోరుతో రగిలిపోతున్నారు.

- తెలుగుదేశం పార్టీలో గ్రూపుల గొడవ
- కొండపి నియోజకవర్గంలో అంతా 'సత్య'మే
- నూకసాని, సత్య మధ్య చిచ్చు పెట్టిన సాగునీటి ఎన్నికలు
- వైపాలెంలో బావమర్ది పెత్తనంపై మండిపడుతున్న వైరివర్గం
- దర్శిలో కొత్త, పాత గ్రూపులుగా విడిపోయిన టీడీపీ నాయకులు
- ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేల మధ్య దూరం పెంచిన ఉప్పుగుండూరు వ్యవహారం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా టీడీపీలో గ్రూపు తగాదాలు పెచ్చుమీరాయి. ఏ నియోజకవర్గంలో చూసినా రెండు మూడు గ్రూపులుగా తయారైన పచ్చ ముఠా మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని ఉంది. పార్టీ ఎమ్మెల్యేల అండ చూసుకొని ఎవరికి వారు చక్రంతిప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. దాంతో నాయకులు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. దీనికి ముఖ్య కారణం అక్రమ వ్యాపారాల వాటాలను పంచుకోవడంలో వస్తున్న తేడాలే అని పార్టీ శ్రేణులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నాయి. పార్టీలో అవినీతి పరాకాష్టకు చేరిందని కార్యకర్తలు వాపోతున్నారు. మద్యం వ్యాపారాన్ని ప్రైవేటు పరం చేసి కార్యకర్తలకు అప్పగించడంతో మొదలైన గ్రూపుల గొడవ మైనింగ్ అక్రమ రవాణా, ఇసుక, మట్టి తరలింపు, రేషన్ అక్రమ వ్యాపారాలతో తీవ్రదశకు చేరుకుంది. ఈ వ్యాపారాలన్నిటిలోనూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు వాటాలు అడుగుతుండడంతో ఎమ్మెల్యేలకు, నాయకులకు మధ్య దూరం పెంచుతోంది. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నూకసానికి తప్పని అవమానం...

కొండపి నియోజకవర్గంలో నీటి సంఘాల ఎన్నికలు అధికార టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీకి మరోమారు అవమానం తప్పలేదు. ఐదేళ్లుగా పార్టీలో అవమానాల పాలవుతున్నా పార్టీని నమ్ముకొని ఎలాగోలా నెట్టుకొచ్చారు. ఫలితంగా టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ పదవిని కట్టబెట్టారు. అయినా ఆయన చేతికి ఎలాంటి అధికారం ఇవ్వలేదని ఆయన సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు సమాచారం. దానికి తోడు ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఆయనకు మనోవేదనకు మిగిల్చాయి. సింగరాయకొండ మండలంలోని బింగినపల్లి బాలాజీ స్వగ్రామం కావడంతో అక్కడ తన అనుచరుడు నూకసాని నరసింహారావుకు అధ్యక్ష పదవిని ఇప్పించుకోవాలని ప్రయత్నించారు. దీనికి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ససేమిరా అంటూ అడ్డు చెప్పారు. అక్కడ తన సన్నిహితుడైన పూడి రోశిరెడ్డికి ఆ పదవి ఇవ్వాలని నిర్ణయించినట్లు తేల్చి చెప్పారు. రెబల్‌గా పోటీకి దించాలని చూసిన బాలాజీ వర్గానికి చెందిన రైతుల తాలుకు నీటి పన్నులను కట్టించుకోకుండా చక్రం తిప్పారు. చివరికి తన మాటే నెగ్గించుకున్నారు. ఈ అవమానాన్ని బాలాజీ జీర్ణించుకోలేక పోతున్నారని సన్నిహితులు చెబుతున్నారు. అంతేకాకుండా కొండపి నియోజకవర్గంలో ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ పేరుకు డోలా బాల వీరాంజనేయ స్వామి ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. అధికారం మాత్రం సత్య చెలాయిస్తున్నారు. ఇటీవల ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసం మంత్రి స్వామి ఒక వ్యక్తికి రెకమెండ్ లెటర్ ఇవ్వగా, ఆ లెటర్‌ను సత్య వెనక్కి పంపించినట్లు విశ్వసనీయ సమాచారం. మంత్రిగా రాష్ట్రంలో తిరిగి నీ పనులు నువ్వు చేసుకో, నియోజకవర్గంలో మాత్రం జోక్యం చేసుకోవద్దని స్వామికి స్పష్టం చేసినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. అంగన్‌వాడీ పోస్టులు, రేషన్ డీలర్షిప్ విషయంలో స్వామి ఎవరికి రెకమెండ్ చేసినా పనులు కాలేదని పార్టీలో చెవులు కొరుక్కుంటున్నారు.

ఆ ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య రేషన్ చిచ్చు..

జిల్లా కేంద్రమైన ఒంగోలు, దానికి కూతవేటు దూరంలో ఉండే సంతనూతలపాడు ఎమ్మెల్యేల మధ్య ఉప్పుగుండూరు రేషన్ వ్యవహారం చిచ్చు రాజేసింది. ఒంగోలు నియోజకవర్గానికి చెందిన వ్యక్తులు సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో రేషన్ వ్యాపారం చేయడం మింగుడుపడని టీడీపీ నాయకులు రేషన్ అక్రమ రవాణా సమాచారాన్ని అధికారులకు ఉప్పందించారు. ఉప్పుగుండూరులోని ఒక రైస్‌మిల్లులో 3 వేల బస్తాలకు పైగా రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లు పక్కా సమాచారం ఇవ్వడమే కాకుండా ఈ విషయాన్ని మీడియాకు కూడా లీక్ చేశారు. దాంతో అనివార్య పరిస్థితుల్లో అధికారులు ఉప్పుగుండూరు రైస్ మిల్లుపై దాడి చేయాల్సి వచ్చింది. కేసు లేకుండా చేయడానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. చివరికి 1547 బస్తాల బియ్యం మాత్రమే దొరికినట్లు కేసు నమోదు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. సొంతపార్టీ నాయకులే తనకు వ్యతిరేకంగా వ్యవహరించడమే కాకుండా సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఆదేశాలతోనే ఇదంతా జరిగిందని దామచర్ల అగ్గిమీద గుగ్గిలం అవుతున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ తన సహచరులపై కేసు నమోదు కాకుండా అడ్డుకోలేక పోయానని దామచర్ల ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయం మాత్రమే కాకుండా పార్టీ నాయకులతో చర్చించకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లను టీడీపీలోకి చేర్చుకోవడం ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారు. నగరంలోని టీడీపీ డివిజన్ అధ్యక్షులందరిలోనూ అసంతృప్తి రగులుతోందని సమాచారం. ఇక ఉడా పదవిపై అనేక మంది నాయకులు ఆశలు పెట్టుకున్నారు. వారిలో మంత్రి శ్రీనివాసరావు ముఖ్యులు. ఆయనకు ఆ పదవి అందని ద్రాక్షలా మారింది. దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుకు ఆ పదవి ఇవ్వడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. తనకు ఆ పదవి రాకపోతే ఇక పార్టీలో ఉండి ఏం చేయాలి అని ఆయన అనుచరుల వద్ద అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

వైపాలెంలో బావమరిది పెత్తనంపై గుస్సా...

యర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి గా వ్యవహరిస్తున్న ఎరిక్షన్ బాబు బావమరిది బాటియా పెత్తనం మితిమీరి పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, అధికార పార్టీ నాయకులకు ఏ పనిపడినా బాటియాను కలవాల్సిందే. ఇదే అదనుగా తీసుకొన్న ఆయన అందినకాడికి బొక్కుతున్నాడని, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులపై ఒత్తిడి చేస్తున్నాడని జోరుగా ప్రచారం జరుగుతోంది. వైద్యారోగ్య శాఖలో ఆయన కొందరికి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. కొండపి ఉపాధి హామీలో ఒక ముఖ్య వ్యక్తికి ఉద్యోగం ఇప్పించినట్లు తెలుస్తోంది. తను అడిగినంత కమీషన్ ఇవ్వలేదని దోర్నాల జాతీయ రహదారి పనులను పది రోజుల పాటు ఆపేయడం సంచలనం సృష్టించింది. ఇక అక్రమ వ్యాపారాల విషయంలో ఇన్‌చార్జితో పాటు ఆయన బావమరిది దూకుడును భరించలేక టీడీపీలోని అసంతృప్తి వాదులు రోజుకో మండలం నుంచి కార్లు వేసుకొని మంగళగిరి వెళుతున్నారు. అధిష్టానానికి ఫిర్యాదులపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఎరిక్షన్ బాబు అవినీతి ఎక్కువైందని, పార్టీలోని ఒక వర్గాన్ని ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నారని నాయకులు చెబుతున్నారు. కాగా ఎరిక్షన్ బాబు వర్గంలోని ఒక చోటా నాయకుడు సాయిబాబా నగర్‌లో జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం తరలింపు గురించి అధికారులకు సమాచారం అందించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

కొత్త టీడీపీ, పాత టీడీపీ నాయకులుగా పోరు...

దర్శి నియోజకవర్గంలో ఆది నుంచి గొట్టిపాటి లక్ష్మి వ్యవహార శైలి పట్ల ఇంటా బయట విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక పార్టీ ఇన్‌చార్జిగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారుల కుర్చీలో కూర్చుని సమీక్షలు నిర్వహించడంపై ప్రజలు సైతం మండిపడ్డారు. తాజాగా పచ్చ పార్టీలో కోల్డ్ వార్ జరుగుతోంది. దర్శి మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు నారపుశెట్టి పాపారావు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఉడా) చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అధిష్టానం కూడా ఆయనకు పదవి ఇచ్చేందుకు సంసిద్ధత తెలిపినట్లు వార్తలు వచ్చాయి. ఆయనకు పదవిని ఇవ్వడం ఇష్టంలేని పార్టీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి తన బాబాయ్ మంత్రి రవి ద్వారా అడ్డుకున్నట్లు తెలుస్తోంది. నిజానికి లక్ష్మి కూడా ఆ పదవిపై కన్నేశారని సమాచారం. దాంతో ఇద్దరి మధ్య విభేదాలు రాజుకుంటున్నాయి. అంతేకాకుండా గతంలో దర్శి నియోజకవర్గంలో రేషన్, మద్యం, ఇసుక అక్రమ వ్యాపారాలను పార్టీ శ్రేణులు నిర్వహించుకొని సొమ్ము చేసుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. నియోజకవర్గంలో ఏ వ్యాపారం అయినా సరే తన కనుసన్నల్లోనే నడవాలని ఆమె చెబుతున్నట్లు భోగట్టా. ముండ్లమూరు మండలంలోని దోర్నపువాగు నుంచి తీసే పోలవరం ఇసుకకు మంచి డిమాండ్ ఉంది. దాంతో సొంత మనుషులను పెట్టి ఇసుక తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా రేషన్ అక్రమ వ్యాపారంలో కూడా ఆమె ఇబ్బందులు పెడుతున్నట్లు సమాచారం. 10 మంది టీడీపీ నాయకులు కలిసి సిండికేట్‌గా తయారై బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారు. నెలకు రూ.30 లక్షలు ఇచ్చి మీ వ్యాపారం మీరు చేసుకోండని ఆమె చెప్పడంతో నోరెళ్లబెట్టినట్లు సమాచారం. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లిస్తే ఇక తమకు మిగిలేదేమిటని వారు వాపోతున్నారు. తాళ్లూరు మండలంలో ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికలు అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచి ప్రస్తుతం టీడీపీలోకి వెళ్లిన మండలాధ్యక్షుడు శ్రీనివాస్ పెత్తనం చేయడం పార్టీలోని సీనియర్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. అక్కడా ఇక్కడా ఆయనదే పెత్తనం అయితే ఎలా అంటూ పెదవి విరుస్తున్నారు. దాంతో మండలంలో పాత టీడీపీ, కొత్త టీడీపీ నాయకులుగా విడిపోయి ఎవరి రాజకీయాలు వారు చేస్తున్నారు. ఈ పరిస్థితి ఒక్క తాళ్లూరు మండలంలోనే కాదు దర్శి నియోజకవర్గంలోని అన్నీ మండలాల్లోనూ ఇలాగే ఉంది. పచ్చ తమ్ముళ్లు రెండు వర్గాలుగా విడిపోయారు.

ఏకాభిప్రాయంతోనే నిర్ణయాలు

- పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



కొండపి మండల పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నూతన కమిటీల నియామకంలో సమష్టిగా ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవటం తప్ప ఏకపక్ష నిర్ణయాలు ఉండవని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీలను నియమిస్తామని పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రకటించారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం పార్టీ నూతన కమిటీల ఏర్పాటు పై కొండపి మండల నాయకులతో గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయటమే లక్ష్యంగా నాయకులతో చర్చించి ఆమోదయోగ్యమైన వ్యక్తిని అధ్యక్షునిగా నియమిస్తారని, అతని నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఏ సమస్య అయినా సమష్టి నిర్ణయాలతోనే పరిష్కరిస్తామని వివరించారు. పార్టీలో గ్రూపు రాజకీయాలు సహించనని గ్రూపులు కట్టేవారు పార్టీకి అవసరం లేదన్నారు. ఇప్పటి వరకు కొండపి ఇన్‌చార్జిగా తాను ఉంటానా లేదా అన్న చర్చ నడిపారని, కానీ తాను ఎక్కడికీ వెళ్లనని కొండపిలో పార్టీ జెండా ఎగురవేయటమే లక్ష్యంగా కృషి చేస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని వివరించారు. టీడీపీ కూటమికి ఇచ్చిన ఆరునెలల హనీమూన్ సమయం పూర్తయిందని, ఇకపై మన నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ జపం చేయటమే టీడీపీ నైజం:

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు పూర్తయినా ఇంకా వైఎస్సార్ సీపీ జపం చేయటం సిగ్గుచేటని మాజీ మంత్రి సురేష్ ఎద్దేవా చేశారు. ఈరోజు ఏ అవినీతి జరిగినా, ఏ ఉపద్రవం జరిగినా వైఎస్సార్‌సీపీకి అంటగట్టడం ఆనవాయితీగా మారిందన్నారు. వర్షాలు, వరదలు వస్తే దానికి వైఎస్సార్‌సీపీ కారణమంటారు, ఓడలో బియ్యం తీసుకెళ్తుంటే దానికి వైఎస్సార్ సీపీ కారణమంటారు, పొద్దున లేచినప్పటి నుంచి కలెక్టర్లను, అధికారులను తిడతారన్నారు. ఇప్పటికి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు అయిందని ఒక్క హామీ నెరవేరలేదని చెప్పారు. మహిళలు, రైతులు, ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నిన్న గ్రామ వాలంటీర్లను పీకారు... ప్రస్తుతం పింఛన్లు పీకే పనిలో పడ్డారు. ఇప్పటిదాకా భూములు, ఆస్తులపై దాడులు జరిగాయి. ఇప్పుడు ప్రభుత్వ చేష్టల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీంతో గత ప్రభుత్వం ఏం చేసిందీ, ఈ ప్రభుత్వం ఏం చేస్తుందో బేరీజు వేసుకుంటున్నారని వివరించారు. ఈనెల 27వ తేదీ విద్యుత్ చార్జీల పెంపుపై, జనవరి 3వ తేదీ విద్యార్థులకు బాసటగా జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేస్తారన్నారు.

మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణేదీ..

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తులు పద్మావతి



మున్సిపల్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనంలో గుడ్లు పరిశీలిస్తున్న బత్తుల పద్మావతి

ఒంగోలు సిటీ: ఒంగోలు రామ్‌నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులపై పర్యవేక్షణ లోపించిందని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. రామ్‌నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, బాలసదనంను బుధవారం ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులు తాగడానికి నీరు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు ఎక్కువ మంది ఉన్నా తక్కువగా గుడ్లు ఎందుకున్నాయని ప్రశ్నించారు. స్టాకు రిజిస్టర్ ప్రకారం 4 క్వింటాళ్ల 59 కేజీల 600 గ్రాములు ఉంటే, సరుకు మాత్రం 18 బస్తాలు ఎందుకు ఉన్నాయి, అవి ఎక్కడి నుంచి వచ్చాయి అని ప్రశ్నించారు. ప్రధానోపాధ్యాయులు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూల్ ప్రాంగణంలోనే మధ్యాహ్న భోజనం వండించాలని, బయటి నుంచి తీసుకురావద్దని సూచించారు. ఆర్వో ప్లాంటు పనిచేయకపోవడంతో విద్యార్థులు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారని వెంటనే పిల్లలకు తాగునీటిని అందించాలని ఎంఈఓ కి చెప్పారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన విషయంలో ఇంత నిర్లక్ష్యంగా ఉన్న ప్రధానోపాధ్యాయులకు వెంటనే షోకాజ్ నోటీస్ ఇవ్వాలని డీఈవోకు సూచించారు. అంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అన్నీ సక్రమంగా అందజేస్తున్నారా అని అడిగారు. రామ్‌నగర్‌లోని బాలసదనం, శిశుగృహను సందర్శించి అక్కడి పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలసదనములోని పిల్లలు ఎవరు ఖాళీగా ఉండకూడదని, అందరూ స్కూల్స్‌కు వెళ్లాలని సూచించారు. అక్కడి స్టాకు రూంలను పరిశీలించారు. శిశుగృహలోని పిల్లలను త్వరితగతిన దత్తత పంపించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదే విధంగా మంచి పౌష్టికాహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యశర్మ, ఎంఈఓ-2 సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



బాలలకు రిలీఫ్ సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: వెట్టిచాకిరీ రహిత, బాలకార్మిక రహిత జిల్లా ఆవిర్భావమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ఒంగోలు మండలంలోని కరవదిలో ఉన్న కళ్యాణ్ ఆక్వా ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో వెట్టి చాకిరి చేస్తున్న ఇద్దరు కిశోర బాలలకు విముక్తి కల్పించడమే కాకుండా వారి స్వస్థలానికి పంపించేందుకు కలెక్టర్ బుధవారం చర్యలు తీసుకున్నారు. వారు పనిచేసిన కాలానికి చట్ట ప్రకారం రావాల్సిన డబ్బులను కూడా సంబంధిత పరిశ్రమ నిర్వాహకుల నుంచి ఇప్పించారు. మధ్యప్రదేశ్ లోని దిండోరి జిల్లా నుంచి ఎనిమిది మంది కళ్యాణ్ ఆక్వా పరిశ్రమలో పనికోసం వచ్చారు. అనంతరం కొన్ని రోజులకే నలుగురు తిరిగి వెళ్లిపోగా, తర్వాత మరో ఇద్దరు వారి స్వస్థలాలకు వెళ్లిపోయారు. మిగిలిన ఇద్దరు వెళ్లిపోతారనే ఉద్దేశంతో వారి వద్ద ఉన్న మొబైల్స్‌ను సంబంధిత పరిశ్రమ నిర్వాహకులు తీసుకున్నారు. వీరికి టెలిఫోన్ సదుపాయం లేకుండా చేయడంతో పాటు, రెండున్నర నెలల కాలానికి ఇవ్వవలసిన డబ్బులు కూడా ఇవ్వలేదు. స్వస్థలాలకు వెళ్లిన వారు తాము ఎదుర్కొన్న ఇబ్బందులను జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన కలెక్టర్ బాధితులను విడిపించే కార్యక్రమం చేపట్టాలని ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న ను ఆదేశించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ దుర్గాభవాని, ఒంగోలు లేబర్ ఆఫీసర్ ఎలిజబెత్తమ్మలతో సమన్వయం చేసుకుంటూ సార్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీల్‌కుమార్, ఇతర ఎన్‌జీవో ల సహకారంతో ఈ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఇద్దరికీ ప్రకాశం భవన్‌లో కలెక్టర్ రిలీఫ్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధి ప్రియాంక, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఓపీ విభాగం ఆకస్మిక తనిఖీ



క్యాన్సర్ ఓపీ విభాగాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఒంగోలు టౌన్: జీజీహెచ్‌లోని ఆంకాలజీ విభాగాన్ని ప్రివెంటివ్ ఓపీడీ రాష్ట్ర అధికారుల పర్యవేక్షణ బృందం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శ్యామల దేవి, కన్సల్టెంట్ రాజకిరణ్, డబ్ల్యూహెచ్ఓ అధికారులు డాక్టర్ పాటిల్, డాక్టర్ సురేష్ సంయుక్తంగా ఒక టీంగా బుధవారం జీజీహెచ్‌ను సందర్శించారు. నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, డాక్టర్ల వైద్య సేవలు, చికిత్సలు అందిస్తున్న తీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అనుమానిత కేసులను క్యాన్సర్ ఓపీకి రెఫర్ చేస్తారని, ఇక్కడకు వచ్చిన రోగిని ప్రివెంటివ్ అంకాలజీ నోడల్ అధికారితో డా.తిరుమలరావు, దంత, గైనికాలజీ విభాగాలకు చెందిన వైద్యులు పరీక్షిస్తారని వివరించారు. ప్రతి మంగళవారం, గురువారం క్యాన్సర్‌కు వైద్య చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు, ఆర్ఎంఓ డా.మాధవీలత, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా.భగీరధి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.నామినేని కిరణ్, సర్జికల్ అంకాలజిస్ట్ డా.కిరణ్, డీపీఎంఓ డా.వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులు 23లోగా తప్పులు సరిచేసుకోవాలి

ఒంగోలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల దరఖాస్తుల్లో పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ లేదా మీడియం నమోదులో దొర్లిన తప్పులను ఈ నెల 19 నుంచి 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సరిచేసుకోవాలని డీఈఓ ఎ.కిరణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులందరూ ప్రత్యే దృష్టి సారించాలని ఆదేశించారు. ఇదే చివరి అవకాశమని, గడువులో ఎలాంటి సడలింపులు ఉండవని స్పష్టం చేశారు. ఏదైనా పొరపాట్లు దొర్లితే పూర్తి బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులదేనని తేల్చిచెప్పారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురికి రిమాండ్

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హాజీపురం అడ్డరోడ్డు సమీపంలో గుడిపాటిపల్లి రోడ్డులో దారి దోపిడీకి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులకు బుధవారం కనిగిరి సివిల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై కె.మాధవరావు తెలిపారు. పోలీసులు కథనం మేరకు.. ఈ ఏడాది జనవరి 14న మోటార్ బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తు తెలియని దుండగులు అటకాయించారు. వారిని కొట్టి గాయపరిచి రెండు సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు దోచుకున్నారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీఎస్‌పురం మండలం అగ్రహారానికి చెందిన సవరం నారాయణ, సవరం పోలయ్య, నంద్యాల జిల్లా గడివేములకు చెందిన గుళ్ల వీరన్నను నిందితులుగా గుర్తించారు. బుధవారం ముగ్గురు నిందితులను హాజీపురం–కంభం అడ్డరోడ్డులో అదుపులోకి తీసుకుని కనిగిరి సివిల్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు.

20 నుంచి ఫిలాటలీ స్టాంపుల ప్రదర్శన

ఒంగోలు వన్‌టౌన్: ప్రకాశం డివిజన్ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఫిలాటలీ స్టాంపుల ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ప్రకాశం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎండీ మహ్మద్ జాఫర్ సాదిక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నగరంలోని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ హాల్లో డిసెంబర్ 20, 21వ తేదీల్లో ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫిలాటలీ స్టాంపులు అంటే తపాలా స్టాంపులు, పోస్టల్ చరిత్ర అధ్యయనమని వివరించారు. ఈ ప్రదర్శనలో వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన ఫిలాటలిస్టులు వారి వద్ద ఉన్న అరుదైన జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ చారిత్రక ప్రదేశాలు, జంతువులు, పక్షులు, మహోన్నత వ్యక్తుల స్టాంపులను ప్రదర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు లేఖా రచనలు, క్విజ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ‘పెనుగొండ’కు అభినందనలు

ఒంగోలు మెట్రో: ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘ జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించడంపై జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. పెనుగొండ రచించిన ‘అభ్యుదయ వ్యాస సంపుటి’కి అవార్డు దక్కడం సంతోషంగా ఉందని కళా మిత్ర మండలి(తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభినందనలు తెలియజేసిన వారిలో నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, న.ర.సం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, మిడసల మల్లికార్జునరావు, యు.వి.రత్నం, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, యువ కవయిత్రి బీరం అరుణ, కె.బాలకోటయ్య, ఓరుగంటి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఏకేయూకు బొలెరో క్యాంపర్ వితరణ

- వీసీకి అప్పగించిన ఎస్‌బీఐ అధికారులు



ఏకేయూ వీసీ మూర్తికి బొలెరో క్యాంపర్‌ను అప్పగిస్తున్న ఎస్‌బీఐ ఉన్నతాధికారులు

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ అభివృద్ధికి చేయూత ఇచ్చే కార్యక్రమంలో భాగంగా భారతీయ స్టేట్ బ్యాంకు అధికారులు సుమారు రూ.12 లక్షల విలువైన బొలెరో క్యాంపర్ వాహనాన్ని బుధవారం వీసీ ప్రొఫెసర్ మూర్తికి అందజేశారు. అనంతరం ఎస్బీఐ అమరావతి జీఎం శైలేష్‌కుమార్, అధికారులు కృష్ణకుమార్, ప్రభు, గున్నేశ్వరరావు, వెంకటరావు తదితరులను వీసీతోపాటు రిజిస్ట్రార్ బి.హరిబాబు ఘనంగా సన్మానించారు. యూనివర్సిటీ పరీక్ష విభాగానికి అంతర్గత రవాణా కోసం వాహనం ఎంతో ఉపయోగపడుతుందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఎస్.రాజు, డాక్టర్ భారతీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకులం.. ప్రభుత్వం చెప్పిందే చేస్తున్నాం

- తీవ్రమైన ఒత్తిడితో విధులు నిర్వర్తిస్తున్నా ఆంధ్రజ్యోతిలో తప్పుడు కథనాలు
- సచివాలయ వ్యవస్థను నీరుగార్చే పన్నాగాన్ని ఖండిస్తున్నాం
- కార్పొరేషన్ కార్యాలయం వద్ద సచివాలయ సెక్రటరీల నిరసన



ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సచివాలయ కార్యదర్శులు

ఒంగోలు సబర్బన్: సర్వేలు, అనేక సేవా కార్యక్రమాల పేరుతో సచివాలయాల సెక్రటరీలను ఫీల్డ్ మీదనే ప్రభుత్వం తిప్పుతోందని, అయితే ఆంధ్రజ్యోతి పత్రిక మాత్రం తమపై అక్కసు వెళ్లగక్కుతోందని సచివాలయాల కార్యదర్శులు ధ్వజమెత్తారు. సచివాలయ సిబ్బంది కార్యాలయంలో ఉండటం లేదని, విధులకు గైర్హాజరవుతున్నారని ఆంధ్రజ్యోతి ప్రకాశం జిల్లా ఎడిషన్‌లో మంగళవారం కథనం ప్రచురించారు. దీనిపై స్థానిక ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం ముందు బుధవారం సాయంత్రం ఒంగోలు నగరంలోని వార్డు సచివాలయాల కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి పత్రికకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వార్డు సచివాలయాల అసోసియేషన్ నాయకుడు ఎస్‌కే.బాష మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ప్రస్తుతం హెచ్‌హెచ్ జియో లొకేషన్ సర్వేతోపాటు ఎస్‌పీసీఐ లింకేజ్ బ్యాంకు అకౌంటుకు ఎంఎస్‌ఎంఈ సర్వే, సమగ్ర కుటుంబ సర్వే, పెన్షన్ల పంపిణీ, బీఎల్‌ఓ వర్కులు అన్నీ ఫీల్డ్‌లోనే చేయాల్సి ఉందన్నారు. వీటిని సచివాలయంలో సిబ్బంది అందరూ చేయాల్సి ఉందని చెప్పారు. వాటితో పాటు వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రోసెసింగ్ సెక్రటరీలు మళ్లీ ఏపీ సేవ రెగ్యులర్ సర్వీసులు కూడా చేయాలన్నారు. అడ్మిన్ సెక్రటరీపై సర్వేలతో పాటు పన్ను వసూలు చేయాలి, బీఎల్‌ఓ డ్యూటీలు, అమినిటీస్ నీటి పన్ను, నీటి సప్లై, హౌస్ కట్టుకునే అప్లికేషన్, బీఎల్‌ఓల డ్యూటీ కూడా చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఓకుల,, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లతో పాటు ల్యాండ్ గురించి, కోర్టు కేసులు చూడాలి, బీఎల్‌ఓ, సూపర్‌వైజర్ డ్యూటీలు కూడా చేస్తున్నామన్నారు. ఏఎన్‌ఎంకు వార్డు పరిధిలోని ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సర్వేలు, శానిటేషన్ సెక్రటరీ ప్రతి రోజూ తెల్లవారు జామున 5 గంటలకు వార్డును పరిశుభ్రంగా ఉంచే పనిలో నిమగ్నమవుతారని పేర్కొన్నారు. వెల్ఫేర్ సెక్రటరీ అన్నిరకాల పథకాలతో పాటు బీఎల్‌ఓ డ్యూటీ చేయాల్సి ఉందన్నారు. ప్లానింగ్ సెక్రటరీ నిరంతరం ఆక్రమణలు, వాటి తనిఖీలు ఉంటాయి, బీఎల్‌ఓ డ్యూటీ ఉంటుందన్నారు. మహిళా పోలీసు అంగన్ వాడీ డ్యూటీ, బీఎల్‌ఓ డ్యూటీ, ఎనర్జీ సెక్రటరీ నిరంతర కరంట్ వర్క్ చూడాలన్నారు. విలేజ్ లో అగ్రికల్చర్, ఫిషరీస్, సెరీ కల్చర్, హార్టీ కల్చర్, సర్వేయర్‌లు నిరంతరం వాళ్లు కష్ట పడుతూనే ఉన్నారని చెప్పారు. వాళ్లకు కూడా బీఎల్‌ఓ డ్యూటీలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. పై పనులన్నీ చేస్తున్న సచివాలయ వ్యవస్థ మీద అనుచితంగా రాయడం సరైన పద్ధతి కాదని ఆంధ్రజ్యోతి పత్రిక యాజమాన్యానికి హితవు పలికారు. ఇదేరకంగా రాస్తూ పోతే ఆ పత్రికపై తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కమిషనర్ కే.వెంకటేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగరంలో 70 సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లిం సోదర భావమే దేశానికి మేలు

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు



మైనారిటీ హక్కుల సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

ఒంగోలు టౌన్: దేశ ప్రజల మధ్య సామరస్యాన్ని పెంపొందించేలా హిందూ, ముస్లింల మధ్య సోదర భావమే మేలు చేస్తుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. నగరంలోని కమ్యూనిటీ హాలులో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ అష్ఫఖుల్లా ఖాన్ వర్ధంతి సందర్భంగా ‘మైనారిటీల హక్కులు, ప్రభుత్వాల వైఖరి’ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో అష్ఫఖుల్లా ఖాన్, పండిత రాంప్రసాద్ బిస్మిల్ స్నేహం నుంచి నేటి తరం స్ఫూర్తి పొందాలని కోరారు. ఏ దేశంలోని మైనారిటీలైనా ఒక్కటేనని, వారి హక్కుల రక్షణ బాధ్యత ప్రభుత్వాల మీద ఉందన్నారు. దేశభక్తి పేరుతో మైనారిటీల మీద దాడులు దేశానికి ఎంతమాత్రం మంచిది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల వక్ఫ్ బోర్డులో తీసుకొని వస్తున్న మార్పులు సమర్థనీయం కాదని చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతి, ఎన్ఆర్‌సీ, త్రిపుల్ తలాఖ్ లాంటివి మైనారిటీ ప్రజలను లక్ష్యంగా చేసుకొని తీసుకొస్తున్నవేనని, రాజకీయ ప్రయోజనాల కోసం మతాల మధ్య చిచ్చు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో న్యాయవాది షేక్ కరీముల్లా, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మహబూబ్, ఇన్సాఫ్ నాయకులు సయ్యద్ సర్దార్, ఆవాజ్ నాయకులు ఎస్‌డీ హుసేన్, మైనారిటీ హక్కుల సంఘం నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, కమిటీహాల్ నాయకులు రవూఫ్, ప్రముఖ రచయిత బా రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి గాయకులు షేక్ షరీఫ్ ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్వాతంత్ర్య పోరాట యోధుడు అష్ఫఖుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కారు ఢీకొని ఒకరు మృతి

- ప్రమాదంతో భార్యకు తీవ్ర గాయాలు



రొడ్డ గంగరాజు (ఫైల్)



మృతుడు రొడ్డా గంగరాజు



ప్రమాదానికి కారణమైన కారు

త్రిపురాంతకం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం త్రిపురాంతకం మండల పరిధిలో మేడపి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ముడివేముల గ్రామానికి చెందిన రొడ్డ గంగరాజు, భార్య నాసరమ్మ, పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై త్రిపురాంతకం బయలుదేరారు. అదే సమయంలో దోర్నాల నుంచి వినుకొండ వైపు కారులో వెళ్తున్న ఐటీడీఏ అధికారి నరసింహరావు మేడపి సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టారు. దీంతో గంగరాజు, నాసరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను పల్నాడు జిల్లా వినుకొండ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగరాజు(32) మృతి చెందగా, నాసరమ్మకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన గంగరాజు గ్రామంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుడిగా ఉన్నారు. ఆయన భార్య నాసరమ్మ గ్రామ రెండో వార్డు మెంబరుగా, తల్లి వెంకటమ్మ నాలుగో వార్డు మెంబరుగా కొనసాగుతున్నారు. గంగరాజు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి బాధాకరమని వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

నిబంధనలు పాటించినా అక్రమ కేసు



పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇసుక టిప్పర్

పొదిలి: ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక రవాణా చేస్తున్నప్పటికీ తమ టిప్పర్లపై అన్యాయంగా అధికారులు కేసులు నమోదు చేస్తున్నారని టిప్పర్ యజమాని ఎం.మురళి ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ26టీఎఫ్ 2408 నంబర్ గల తన టిప్పర్‌లో ఇసుక రవాణా చేస్తుండగా పొదిలి అడ్డరోడ్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద కొంత మంది వ్యక్తులు ఆపారని తెలిపారు. డ్రైవర్‌ను బెదిరించి పొదిలిలో ఇసుక తోలేందుకు వీల్లేదని దబాయించారని, టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌లో పెట్టించారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి తన టిప్పర్‌లో 32 టన్నుల ఇసుక తరలిస్తున్నామని, అన్ని అనుమతులు ఉన్నాయని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ఎస్సై వేమనకు వివరించినా పట్టించుకోకుండా దర్శి ఎంవీఐతో ఓవర్ లోడ్ కేసు రాయించి, రూ.55 వేలు జరిమానా విధించారని వాపోయారు. ఈ విషయమై ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చినా ఎవరూ స్పందించలేదని తెలిపారు. ఈ విషయమై ఎస్సై వేమనను వివరణ కోరగా.. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను ఆపామని, జరిమానా విధించి పంపించినట్లు తెలిపారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

మద్దిపాడు: భూ సమస్యల పరిష్కారానికి గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు మండలం రాచవారిపాలెం గ్రామ రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూముల రికార్డులు పరిశీలించుకోవడంపై రైతులకు దిశానిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. వచ్చిన ప్రతి అర్జీకి రశీదు ఇవ్వడంతోపాటు సమస్యల పరిష్కారం దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ పొలాల్లో వర్షాకాలంలో నీరు నిలిచిపోతుందని, పొలాలు ఆరడానికి 15 నుంచి 20 రోజుల సమయం పడుతుండటంతో పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కలెక్టర్‌కు వివరించారు. నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ ఎం.సుజన్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కుమార్ రెడ్డి, ఆర్ఐ రమణయ్య, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జవాన్ సుబ్బయ్య అమర్ రహే..

- రావిపాడులో విద్యార్థుల ర్యాలీ

కంభం: ఇటీవల జమ్మూలో ల్యాండ్ మైన్ పేలిన ప్రమాదంలో మృతి చెందిన రావిపాడు గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ వరికుంట్ల సుబ్బయ్యకు విద్యార్థులు ఘన నివాళులర్పించారు. జమ్మూ ల్యాండ్ మైన్ పేలిన ఘటనలో సుబ్బయ్య తన ప్రాణాలొడ్డి 30 మంది జవాన్లను కాపాడిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం మృతుడి స్వగ్రామం రావిపాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్మీ జవాన్ చిత్రపటాలు, జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. సుబ్బయ్య అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.



ఆర్మీ జవాన్ సుబ్బయ్య చిత్రపటంతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పశు సంవర్ధకశాఖ ఉద్యోగిపై విచారణ



విచారణలో పాల్గొన్న అధికారులు

మార్కాపురం: మార్కాపురం పశు సంవర్ధకశాఖ ఉద్యోగి పి.ఇజాజ్ అహ్మద్ ఖాన్‌పై వచ్చిన శాఖాపరమైన ఆరోపణలపై బుధవారం ఆ శాఖ ఉన్నతాధికారులు మార్కాపురంలోని డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కనిగిరి నియోజకవర్గంలోని హనుమంతునిపాడు మండలం సీతారామపురంలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్‌గా పనిచేసిన టీవీ చెన్నయ్య పదవీ విరమణ చేశారు. ఆయన ఈ ఏడాది జూలై 4న మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లును మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయానికి పంపారు. ఈ బిల్లును జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయానికి పంపాలని అధికారులు ఆదేశించినా అహ్మద్‌ఖాన్ తన వద్దే పెట్టుకుని చెన్నయ్యకు ఫోన్ చేసి రమ్మని చెప్పారు. ఆయన రాకపోవడంతో 4 నెలల తర్వాత ఆ బిల్లును తిప్పి పంపారు. దీంతో చెన్నయ్య మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్‌ను కలిసి సదరు ఉద్యోగి అవినీతిపై అక్టోబరు 22న ఫిర్యాదు చేయడంతో బుధవారం ఒంగోలు వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.జగత్‌శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ బసవ శంకర్, మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ రాఘవయ్య విచారణ చేపట్టారు. చెన్నయ్యతోపాటు ఉద్యోగి అహ్మద్‌ఖాన్ వివరణ తీసుకున్నారు. ఈ విషయమై కనిగిరి పెన్షనర్ల సంఘ అధ్యక్ష కార్యదర్శులు పెద్దిరెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి విచారణకు హాజరై అహ్మద్‌ఖాన్ ఇబ్బందులకు గురిచేస్తున్న తీరును వివరించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని మార్కాపురం వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ రాఘవయ్య తెలిపారు.

ఒంగోలు డిపోలో హైటెన్షన్!

- బాంబ్ బెదిరింపుతో రంగంలోకి దిగిన పోలీసులు
- మాక్ డ్రిల్ అని తెలియడంతో ఊపిరి పీల్చుకున్న జనం



ఆర్టీసీ డిపోలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: జిల్లా కేంద్రమైన ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం అనుమానాస్పదంగా బ్యాగ్ ఉన్నట్లు వచ్చిన సమాచారంతో హుటాహుటిన పోలీసులు రంగంలోకి దిగారు. బీడీ టీం, స్పెషల్ పార్టీ సిబ్బంది డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. దీంతో ఏం జరుగుతోందో తెలియక ప్రయాణికులు ఆందోళన చెందారు. కాసేపటికి అది పోలీసులు నిర్వహించిన మాక్ డ్రిల్ అని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భద్రతా చర్యలపై డెమో డ్రిల్ చేపట్టారు. బ్యాగులో ఉన్న బాంబ్‌ను డిస్పోజల్ సూటు ధరించిన పోలీసులు నిర్వీర్యం చేశారు. ఒకవేళ ఎప్పుడైనా అలాంటి పరిస్థితి ఎదురైతే ప్రజలు ఎలాంటి జాగ్రత చర్యలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఎస్ఐ త్యాగరాజు, ఆర్ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ స్థలం కబ్జాకు మళ్లీ స్కెచ్



ఆక్రమిత స్థలంలో మరోసారి ఏర్పాటు చేసిన ఈ హెచ్చరిక బోర్డునే తొలగించారు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న ఆర్టీసీ అధికారులు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

బేస్తవారిపేట: స్థానిక అంకాలమ్మ వీధిలో హైవే పక్కన బస్ షెల్టర్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు ఓ టీడీపీ నేత మరోమారు యత్నించాడు. ఖరీదైన ఆ స్థలంలో కొంత భాగాన్ని గత రెండు రోజులుగా చదును చేసి మట్టి తోలిస్తున్నాడు. తోకపల్లె–కడప హైవే పక్కన బేస్తవారిపేటలో బస్ షెల్టర్ కోసం సర్వే నంబర్ 283/1లో రెవెన్యూ అధికారులు 20 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. హైవే పక్కన కావడంతో ఒక్కో సెంటు రూ.10–15 లక్షలకుపైగానే ధర పలుకుతోంది. మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న బస్‌షెల్టర్‌లోని కొంత స్థలం ఆక్రమణపై స్థానికులు ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. గిద్దలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్ మంగళవారం ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో బోర్డును తొలగించారు. దీంతో ఒంగోలు ఆర్టీసీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.అంజిబాబు, గిద్దలూరు సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామానాయక్ బుధవారం స్థలాన్ని పరిశీలించారు. బస్‌షెల్టర్ స్థలం ఆక్రమణ, బోర్డు తొలగింపుపై ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. కాగా, గతంలోనూ ఇదే వ్యక్తి ఆక్రమణకు ప్రయత్నించడంతో ఈ ఏడాది ఆగస్టు ఒకటో తేదీన ‘రెచ్చిపోతున్న పచ్చ భూచోళ్లు’ శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. అప్పట్లో రెవెన్యూ అధికారులు, గిద్దలూరు ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

రుణాలు నూరు శాతం రికవరీ చేయాలి

- డీఆర్డీఏ పీడీ వసుంధర



వెలుగు సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ

సంతనూతలపాడు: డ్వాక్రా రుణాలు నూరు శాతం రికవరీ చేయాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వసుంధర వెలుగు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సంతనూతలపాడులోని వెలుగు కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించేలా చూడాలన్నారు. దీనికి సంబంధించి సంతనూతలపాడు మండలం జీరో శాతంతో అట్టడుగున ఉందని, ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రుణాలు తీసుకున్న మహిళలు వ్యాపారంలో రాణించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆకాంక్షించారు. పీఎంఎఫ్ ప్రోగ్రెస్‌కు సిబ్బంది కృషి చేయాలన్నారు. మండలంలో బ్యాంక్ లింకేజీ రుణాల రికవరీ 99 శాతం, స్త్రీ నిధి రుణాల రికవరీ 94 శాతం ఉందని వెలుగు ఏపీఎం బాబూరావు వివరించారు. కార్యక్రమంలో వెలుగు నియోజకవర్గ ఏరియా కోఆర్డినేటర్ విజయమ్మ, వెలుగు సీసీలు పాల్గొన్నారు.